39

## నా రాధకు...



**రాధ, వెన్నెల రేయిలో**
**పున్నమి పూవు పూస్తే**
**కోసి తెచ్చాను నీకోసం-**

** *** **

నీ కలలో మెలుకువకు
ఆ కిలకిల నవ్వుకు
కారణం నేనటే రాధ-

** *** **

**రామచిలుక పలుకు**
**రాజహంస కులుకు**
**నీకు దక్కి అవి ఎంత**
**సంబరపడ్డాయో-**

** *** **

ప్రకృతిలో పచ్చదనం
నీ ఒడిలో వెచ్చదనం
ఈ రెండూ నాకెంతో హాయి-

** *** **

**రాధ, నీవు వేరుగా వున్నావా**
**నాలోనే వున్నావా**
**నా కెప్పుడూ ఎందుకో ఏదో సందేహం-**

** *** **

ఏరు నేనై
నీరు నీవై
వెల్లువై సాగిపోదామా-

** *** **

**రాధ, ప్రేమకు పర్యవసానం**
**రెండు శరీరాల కలయిక కాదు,**
**రెండు మనసుల కదలిక-**

- చల్లా రామక్రిష్ణారెడ్డి





# వయసు మళ్లిన తండ్రి

భూపాల్

"నేను చంగల్‌రావు, తండ్రి కొండల్ రావు, వయస్సు 50 సంవత్సరాలు.

రామచంద్రపురం వాస్తవ్యుడను. శ్రీఅచ్యుతరావు, తండ్రి అలకారావు, వయస్సు 48సంవత్సరాలు, అంకంపెల్లి దగ్గర 20వేలు అక్షరాల ఇరవైవేల రూపాయలు నా అవసరం నిమిత్తం అప్పుగా తీసుకుంటున్నాను.

ఇది నా ఇష్టపూర్తిగా రాసి ఇస్తున్న పత్రం సహి...ఇట్లు చంగల్‌రావు-అని మాత్రమే రాసి వుంది ఆ కాగితంలో. అందు నిమిత్తం భూమి ఇస్తాననీ, వడ్డీ కట్టి ఇస్తాననీ, ఫలానా తేదీ లోపల ఏమీ లేదు.

చంగల్‌రావుకి అచ్యుతరావు స్వయాన బావ. చంగల్‌రావు చెల్లెనే అచ్యుతరావు భార్య. చంగల్‌రావు చాలా అవసరమున్న దశలో చెల్లె ఇంటికి వచ్చి నీళ్ళ గ్లాసు, నిప్పు తొట్టీ నెత్తిమీద పెట్టుకొని ఖుస్కీ భూమి (శెలక) నాలుగు ఎకరాలు పట్టా చేస్తానని ఒట్టు తినే ఆ డబ్బు తీసుకున్నాడు. అతని అవసరం తీరింది. చెల్లె ఆనంద అన్నను అడిగి అడిగి అలిసిపోయింది.

ఇలా ఐదు సంవత్సరాలు గడిచాయి. చెల్లెకు ఎదిగిన కొడుకు, అతనికి వయస్సులో ఉన్న కూతురూ వుంది. రెండు సంవత్సరాల క్రితం చెల్లెలింటికి వెళ్లి తన కూతుర్ని ఆమె కొడుక్కి చేసుకోవాల్సిందిగా అడిగాడు చంగల్‌రావు. ఆమె "ముందు ఓ పదెకరాల భూమి పట్టాచేసి మాట్లాడు" అంది. ఆనంద భర్త ఇంకా నిప్పులు తొక్కి బావమరిదిని నానా మాటలు తిట్టి మళ్లీ ఆ సంబంధం మాట ఎత్తుకొని ఇంటికి రావద్దనీ అనేశాడు.

అంతే! అతను డబ్బు ఇవ్వలేను. వీళ్లు తీసుకోలేదు. భూమి లేదు.

ఇంక చేసేదిలేక జిల్లా కోర్టులో కేసు దాఖలు చేశారు అంటే అదే పిటిషన్ వేశారు. ఆ మాత్రమే కాగితం రాసి వున్న ఆధారంతో ఈ కేసు ఎలా తెల్చాలో అర్థం కాలేదు జడ్జిగారికి. చంగల్‌రావు 'డబ్బులు ఎప్పుడో ఇచ్చేశా' అంటున్నాడు. 'ఇలా చాలా లావాదేవీలు మా మధ్య వున్నాయి. మా చెల్లె చెప్పేవిఅన్నీ అబద్దాలు' అంటున్నాడు. ఇది అబద్ధమని తనకూ తెలుసు, తన తండ్రి వృద్ధుడు కొండల్‌రావుకూ తెలుసు. ఎన్నో తీర్లుగా ఆలోచించిన జిల్లా కోర్టు జడ్జి ఈ సంగతి ఇంకా కొండల్‌రావు మీదే వదిలేసి అతన్ని పిలిపించాడు కోర్టుకి.

"చూడండీ కొండల్‌రావు గారూ! మీకు కళ్లు బాగా కనిపిస్తున్నాయా? చెవులుగూడా వినిపిస్తున్నాయా? మీరు ఇప్పుడెక్కడున్నారో తెలుసా?" అని అడిగాడు.

ఆయన అన్నీ నిజమే చెప్పాడు. వృద్ధుడు మహాగట్టివాడే అనుకున్నాడు జడ్జి.

"ఒకవైపు నీ కూతురు, మరోవైపు నీ కొడుకు. వీళిద్దరూ నీకు రెండు కళ్లు. నీవే న్యాయం చెప్పు. నీ కొడుకు డబ్బు తీసుకున్నాడా? భూమి ఇస్తానన్నాడా? నీ కూతురు డబ్బు ఇచ్చిన మాట నిజం కదా? అందుకు సాక్ష్యం ఈ కాగితమని నీకు తెలుసు గదా! నీవే న్యాయం చెప్పు...ఇందులో ధర్మ నిర్ణేతవు నీవే" అన్నాడు జడ్జి.

ఒక్క నిమిషం ఆలోచించాడు. తొంభై సంవత్సరాల వృద్ధుడు కొండల్‌రావు "ఆ కాగితం నా కొడుకు రాసిచ్చింది కాదు. నా కొడుకు డబ్బే తీసుకోలేదు. నా కూతురుదంతా అబద్ధం" అన్నాడు.

జడ్జి మరోమాట మాట్లాడలేదు. కేసు నిలువలేదు.

కొండల్‌రావు జిల్లా కోర్టుదాటి బయటికొచ్చి కంట తడి పెట్టుకున్నాడు. తండ్రి దగ్గర కొచ్చిన కూతురు 'ఆనంద' "నాన్నా! వెళ్లివస్తా. నీకు ఎప్పుడు నా ఇంటికి రావాలనిపిస్తే అప్పుడురా! నీవు నన్ను గన్నావుగాని, నా డబ్బును కనలేదు. నీ అల్లుడు నీ తీర్పు విని బాధపడలేదు. నీ స్థానంలో తానున్నా ఇదే తీర్పు చెప్పేవాణ్ణని అన్నాడు" అంటూ నవ్వుతూనే రెండు వందలు తండ్రి జేబులో పెట్టి వెళ్ళిపోయింది.

*భౌతిక వాదానికి మూలాధారం ప్రకృతి(పదార్థం) నిజంగా ఉన్నదనే విషయాన్ని గుర్తించడం. మనకు కనిపించేనక్షత్రాలు, సూర్యుడు, భూమి, భూమిమీది పర్వతాలు, లోయలు, సముద్రాలు, అరణ్యాలు, జంతువులు, ఆలోచించగల మానవులు-ఇవన్నీ వున్నాయని గుర్తించడం. ప్రపంచంలో లోకాతీత శక్తులు లేవు. ఉండడానికి వీల్లేదు. అనంతమైన ప్రకృతి రూపాల్లో మానవుడొక భాగం. చైతన్యమనేది మానవుని ప్రత్యేక లక్షణం, శక్తి, ప్రకృతి భౌతికమైనట్టిది. అంటే, మానవుని మనస్సుకు బయట, దానిమీద ఆధారపడకుండా, స్వతంత్రంగా అది వుంటుంది. పదార్థం ప్రధానమైందని, చైతన్యం పదార్థంనుండి ఉద్భవించిందని భావించే తత్వవేత్తలు భౌతికవాదులు. వీరి దృక్పథంలో పదార్థం శాశ్వతమైంది. అది ఎవరో సృష్టించింది కాదు. ప్రకృతికతీతమైన శక్తులు లేవు. విశ్వం పరిధికి బయట మరే శక్తులూ లేవు. చైతన్యమనేది పదార్థం పరిణామ ఫలితం. అది అసామాన్య, క్లిష్ట, పదార్థగత వస్తువైన మానవుని మెదడు ధర్మం.*